వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: ఇందిరాహిల్స్‌ కాలనీలోని బెరాకా ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఆశ్రయం హ్యాండ్‌ ఆఫ్‌ హోప్‌, ప్రతిమ హాస్పిటల్స్‌ సౌజన్యంతో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేశ్‌ గౌడ్‌, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం వైద్యులను, పాస్టర్లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా గణేశ్‌, పోశెట్టి గౌడ్‌, గోపాల్‌, లింగం, సుధాకర్‌, పాస్టర్లు యేసుపాదం, హ్యారీస్‌ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో పనుల పరిశీలన



మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ యూసుఫ్‌నగర్‌ హిందూ శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్‌ సబిహా బేగం, మేడ్చల్‌ జిల్లా మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు మహమ్మద్‌ గౌసుద్దీన్‌, జీహెచ్‌ఎంసీ ఏఈ రంజిత్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో శ్మశాన వాటికలో చేపట్టిన ప్రధాన పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



నిజాంపేట్‌: జీఎస్టీ శ్లాబుల తగ్గింపుపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌.రామచందర్‌ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయంలో గురువారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇతర నాయకులతో పాటు డా.ఎం.ఆర్‌.ఎస్‌.రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ పన్నులు తగ్గించడం హర్షణీయమన్నారు. ఆపరేషన్‌ సిందూర్‌, వికసిత్‌ భారత్‌ వంటి ఎన్నో విజయాలు సాధించిన మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం సంతోషంగా ఉందన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి



మోతీనగర్‌: అపార్ట్‌మెంట్లలో తప్పకుండా ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని కూకట్‌పల్లి జలమండలి జనరల్‌ మేనేజర్‌ హరిశంకర్‌ పేర్కొన్నారు. మూసాపేట జలమండలి పరిధిలోని మోతీనగర్‌లో మేనేజర్‌ విలియం ప్రకాశ్‌తో కలిసి పలు అపార్టుమెంట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో 20 ట్యాంకర్ల కంటే ఎక్కువ బుక్‌ చేసుకున్న వినియోగదారులు ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే ట్యాంక్‌ బుక్‌ చేసుకుంటే అదనపు రుసుం చెల్లించాల్సి వస్తుందన్నారు. అపార్టుమెంట్‌ వాసులు, 300 గజాల స్థలంలో ఇళ్లు ఉన్నవారు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా జలమండలి సిబ్బంది ఇంకుడు గుంతలు, నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డీజీఎం శివ, మేనేజర్‌ విలియం ప్రకాశ్‌ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ జాబితా విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ సీట్లు సాధించిన విద్యార్థుల జాబితా విడుదల పై అధికారులు మౌనం వహిస్తున్నారు. జూలై 19న విడుదల కావాల్సిన జాబితాను ఇంత వరకు వెల్లడించలేదు. జాబితాను విడుదల చేయాలని విద్యార్థులు కోరగా వివిధ కారణాలను చూపుతూ రెండు నెలలుగా పెండింగ్‌లో పెట్టారు. జాబితా విడుదలకు అన్ని అడ్డంకులు తొలిగి, చివరకు డీన్లతో స్టాండింగ్‌ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన తర్వాత కూడా జాబితాను వెల్లడించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వీసీ ప్రొ.కుమార్‌ వెంటనే స్పందించి జాబితాను విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్‌ చేస్తున్నారు.

గణనాథులకు ఘనంగా పూజలు

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా అంటూ.. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో గణేశ్‌ నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పలు మండపాల్లోని గణనాథులను గురువారం ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, పార్టీల నాయకులు, అసోసియేషన్‌ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల అన్నదానం.. మరోవైపు కొన్నిచోట్ల గణనాథులను నిమజ్జనానికి తరలించారు.

– కూకట్‌పల్లి, జోన్‌బృందం



జేఎన్‌టీయూలో పూజలు చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, విద్యార్థులు



కూకట్‌పల్లిలో పూజలు చేసిన కార్పొరేటర్‌ సత్యనారాయణ



మూసాపేటలో అన్నదానం..



పర్వత్‌నగర్‌ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌



కూకట్‌పల్లిలోని వెంకటపాపయ్యనగర్‌లో దామోదర్‌రావు తదితరులు



కేపీహెచ్‌బీ కాలనీలో ..



ధరణినగర్‌లో ..



పూజల్లో బీఆర్‌ఎస్‌ నాయకుడు వెంగళరావు తదితరులు



శ్రీ సాయి ఎన్‌క్లేవ్‌లో కార్పొరేటర్‌ ముద్దం నర్సింహాయాదవ్‌ తదితరులు

పైపులైన్‌ పనులకు శంకుస్థాపన

బాలానగర్‌: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌ రెడ్డితో కలిసి శ్రీశ్రీనగర్‌లోని రూ. 20 లక్షలు, ఇందిరానగర్‌లో రూ. 55 లక్షల వ్యయంతో చేపట్టిన వాటర్‌ పైపులైన్‌ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకప్పుడు ఈ ప్రాంతంలోని ప్రజలు విద్యుత్‌, రోడ్లు, తాగునీటి సమస్యలతో చాలా ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం దశలవారీగా పనులు చేపడుతూ వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్‌ అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్‌ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఘనంగా టీచర్స్‌ డే వేడుకలు



ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో విద్యార్థులు



కిడ్జీ మౌంట్‌ లిటిరా స్కూల్లో..



ఆర్‌పీ కాలనీ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో..



జేఎన్‌టీయూలో ..

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో టీచర్స్‌ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని జ్యోతి ప్రిన్సిపాల్‌గా పని చేయగా, మిగిలిన విద్యార్థులు పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ వెంకటయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్జీ మౌంట్‌ లిటిరా స్కూల్లో..

మూసాపేట శ్రీహరినగర్‌లోని కిడ్జీ మౌంట్‌ లిటెరా స్కూల్లో విద్యార్థులు టీచర్స్‌ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ శ్రావణి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీ కాలనీ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో..

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌లోని ఆర్‌పీ కాలనీ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా, మాజీ కార్పొరేటర్‌ మాధవరం రంగారావు, కార్పొరేటర్‌ సబిహాబేగం సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌, నరసింహ, సంధ్యారాణి, గోపిక, చంద్రరాణి, అఫ్సారా పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో..

బాలానగర్‌: జేఎన్‌టీయూలో గురువారం మెకానికల్‌ విభాగంలోని సెమినార్‌ హాల్‌లో టీచర్స్‌ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీటెక్‌ చదువుతున్న వర్కింగ్‌ ప్రొఫెషనల్‌ విద్యార్థులు తమకు బోధిస్తున్న మెకానికల్‌ హెచ్‌ఓడీ నాగ శారద, ఆచార్యులు రాంజీ, వసంత్‌కుమార్‌, స్రవంతి, అజయ్‌, శంకర్‌గౌడ్‌, భ్రమర, కిషన్‌, రవికిశోర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వర్కింగ్‌ ప్రొఫెషనల్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఓనం వేడుకలు

మూసాపేట: కూకట్‌పల్లిలోని లులు మాల్‌లో ఓనం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రెండు రోజుల పాటు సంబరాలు నిర్వహిస్తున్నట్లు మాల్‌ రీజినల్‌ మేనేజర్‌ మహ్మద్‌ షరీఫ్‌ తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పూల రంగోలి నిర్వహించగా కస్టమర్లతో పాటు మాల్‌ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం వడంవాలి (టగ్‌ ఆఫ్‌ వార్‌), మావెలి మీట్‌ అండ్‌ గ్రీట్‌, సింగారి మేళం ఉంటుందని, ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మాల్‌ మేనేజర్‌ ఎడిల్‌ అరసన్‌ పేర్కొన్నారు. సందర్శకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని తెలిపారు. అలాగే ఓనం సందర్భంగా హైపర్‌ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పాయసం మేళాలో వివిధ రకాల పాయసం వంటకాలు అందుబాటులో ఉంచారు. ఇది ఈనెల 7 వరకు కొనసాగుతుంది.



సంబరాల్లో కస్టమర్లు, మాల్‌ సిబ్బంది

పరిశ్రమ- విద్యారంగం కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు

ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ ఈడీ డా.తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: పరిశ్రమ–విద్యారంగం రెండూ కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌ తేజ్‌ లోహిత్‌రెడ్డి అన్నారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ క్యాంపస్‌లో గురువారం పరిశ్రమ–విద్యారంగంలో పురోగతి సాధించడానికి అవసరమైన చర్యలు అనే అంశంపై జాతీయ పరిశోధనా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని , విద్యార్థులు చదువుతోపాటు వినూత్న ఆలోచనలు, నూతన ఆవిష్కరణలతో భవిష్యత్తు అవసరాలను తీర్చేలా తీర్చిదిద్దాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన మేరకు ఉద్యోగులను అందించేలా విద్యారంగంలో విద్యార్థులకు బోధన, సిలబస్‌ ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. చదువు పూర్తి కాగానే క్యాంపస్‌ సెలక్షన్‌లో ఉద్యోగం సాధించాలనే తపన ప్రతి విద్యార్థిలో ఉంటుందని, అందు కోసం పరిశ్రమలు కూడా ఉన్నత విద్యాసంస్థలతో కలిసి పనిచేస్తే ఎంతో మేలు చేకూరడం ఖాయమన్నారు. పరిశోధనా రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ముందుండాలన్నారు. అనంతరం ఐఐటీ హైదరాబాద్‌ ప్రొఫెసర్‌ సుహాష్‌రంజన్‌డే, ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ పెట్రోలియం నటరాజ్‌ నందమూరు, ఆంధ్రప్రదేశ్‌ నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ డిజైన్‌ ప్రొఫెసర్‌ శ్రీరామ్‌ మట్టేగుంట మాట్లాడుతూ విద్యారంగం అనుబంధ పరిశ్రమల భవిష్యత్తును రూపొందించడంలో తమవంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య దీర్ఘకాలిక భాగస్వామ్యాలు అవసరమని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం 14 మంది అధ్యాపకులు వివిధ ప్రత్యేక డొమైన్లలో ఇంటర్‌ డిసిప్లినరీ పరిశోధనలను ప్రదర్శించారు. 15 మంది విద్యార్థులు మార్గదర్శక ప్రాజెక్టులు, పరిశోధనా భావనలను ప్రదర్శించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: బోయిన్‌ చెరువు కట్టపై రూ. కోటి వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్‌ ముద్దం నర్సింహాయాదవ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్‌ హయాంలో ఈ చెరువు సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేశామని అందులో భాగంగానే కల్వర్టు నిర్మాణం, చెరువు సుందరీకరణ పనులను చేపడుతున్నామన్నారు. అనంతరం మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన

హస్మత్‌పేట బోయిన్‌ చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్‌గౌడ్‌, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ ఆశా నాయకులు నరేందర్‌గౌడ్‌, మక్కాల నర్సింగ్‌రావు, సయ్యద్‌ ఏజాజ్‌, బల్‌రాజు, మక్కాల సత్యనారాయణ, ఖాదీర్‌, మేకల హరినాథ్‌, కర్రె జంగయ్య, మేకల హరినాథ్‌, పోచయ్య, రాజుగౌడ్‌, బండారు తిరుపతి, సరోజదేవి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం, విలువలను మిళితం చేయాలి

ఇఫ్లూ వీసీ నాగరాజు

రాయదుర్గం: భవిష్యత్‌కు నైపుణ్యాలు, విలువలను మిళితం చేయాలని ఇఫ్లూ వీసీ ప్రొఫెసర్‌ ఎస్‌ నాగరాజు అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'కొత్త సామాజిక ఒప్పందం కోసం ఉపాధ్యాయులు' అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సమ్మిళిత బోధనలను ప్రోత్సహించాలని, విద్య హక్కును ప్రజా ప్రయోజనంగా విస్తృతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ జీవితాంతం నేర్చుకోవడానికి కృషి చేయాలన్నారు. 'మనూ' వీసీ ఐనుల్‌ హసన్‌ మాట్లాడుతూ ఉపాధ్యాయ మార్గం సంక్లిష్టమైనది, సున్నితమైనది, సవాళ్లతో కూడి ఉంటుందన్నారు. పరిస్థితులను అర్థం చేసుకోవడం, లోపాలను గుర్తించడం, సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, నాణ్యతను గుర్తించడం వంటి వాటిపై దృష్టి పెట్టిన వారే రాణిస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ ప్రొ.ఇష్తియాక్‌ అహ్మద్‌, ఎస్‌ఈటీ డీన్‌ ప్రొ.వనజ, ప్రొఫెసర్‌ షహీన్‌ ఏ షేక్‌, డా. అథర్‌ హుస్సేన్‌, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఐఎస్‌బీ'లో మోతీలాల్‌ ఓస్వాల్‌ ఎగ్జిక్యూటివ్‌ సెంటర్‌

నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం భట్టి

రాయదుర్గం: మోతీలాల్‌ ఓస్వాల్‌ ఎగ్జిక్యూటివ్‌ సెంటర్‌ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఇండియన్‌ స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌ (ఐఎస్‌బీ) హైదరాబాద్‌ క్యాంపస్‌లో ఒక కొత్త ఆధునిక సౌకర్యం. ఈ కేంద్రం ఏర్పాటుకు మోతీలాల్‌ ఓస్వాల్‌ ఫౌండేషన్‌ నుంచి రూ.100 కోట్లు కేటాయించారు. ఈ కేంద్రాన్ని 1,91,532 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయగా ఈ సెంటర్‌ను శుక్రవారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మోతిలాల్‌ ఓస్వాల్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ లిమిటెడ్‌ సీఈఓ ,మేనేజింగ్‌ డైరెక్టర్‌ మోతిలాల్‌ ఓస్వాల్‌ కలిసి ప్రారంభిస్తారు. ఈ కేంద్రం పెద్ద, ఆధునాతన సముదాయం. ఇది ఎగ్జిక్యూటివ్‌ విద్య, భవిష్యత్‌ వ్యాపార నాయకుల అభివృద్ధిపై ఐఎస్‌బీ దృష్టిని మరింత పెంచడానికి రూపొందించారు. ఇందులో లెక్చర్‌ థియేటర్లు, సమావేశ గదులు, అధ్యాపకులు, సిబ్బందికి కార్యాలయాలు, సహకారం, అభ్యాసాన్ని పెంపొందించడానికి అంకితమైన ఫ్యాకల్టీ లాంజ్‌ ఉన్నాయి.

ఉన్నత ప్రమాణాల విద్యను ప్రోత్సహించడమే లక్ష్యం : మోతీలాల్‌ ఓస్వాల్‌

భారతదేశంలోని విద్యారంగంలో ఉన్నత ప్రమాణాలతో విద్యను ప్రోత్సహించడమే మోతీలాల్‌ ఓస్వాల్‌ ఫౌండేషన్‌ లక్ష్యంగా పనిచేస్తుందని ఆ ఫౌండేషన్‌ చైర్మన్‌ మోతీలాల్‌ ఓస్వాల్‌ స్పష్టం చేశారు. ప్రతిభ అవకాశాలు, వనరులు, మార్గదర్శకత్వం, అనుకూలమైన వాతావరణంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

వ్యాపారవిద్యలో ఐఎస్‌బీ ఒక అత్యుత్తమ కేంద్రం : హరీశ్‌మన్వాని

భారతదేశంలో వ్యాపార విద్యలో ఐఎస్‌బీ ఒక అత్యుత్తమ కేంద్రంగా మారిందని ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్‌ బోర్డు చైర్మన్‌ హరీష్‌ మన్వాని స్పష్టం చేశారు. వేగంగా మారుతున్న వ్యాపార వాతావరణంలో తమ సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి భారతదేశంలోని కార్పొరేట్‌ ఎగ్జిక్యూటివ్‌లకు ప్రపంచ స్థాయి ఎగ్జిక్యూటివ్‌ విద్య అవసరం ఉందన్నారు.



ఇటీవల ఒప్పందం చేసుకున్న ప్రతినిధులు

గణనాథుల నిమజ్జనానికి సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్‌ చెరువులో సామూహిక వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. శనివారం చివరి రోజు కావడంతో కూకట్‌పల్లి ఐడీఎల్‌ రంగధాముని చెరువు కట్టపై భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌ కె.వి. సుబ్బారావు తెలిపారు.

భారీ బందోబస్తు..

సుమారు 220 మంది పోలీసులు బందోబస్తులో ఉండనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 100 మంది ట్రాఫిక్‌ పోలీసులు విధుల్లో ఉంటారని ట్రాఫిక్‌ సీఐ తెలిపారు. కంట్రోల్‌ రూం ఏర్పాటు చేశామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులున్నా.. ఫిర్యాదు చేయాలని సూచించారు. సుమారు 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని భక్తులు నిమజ్జనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

వాహనాల పార్కింగ్‌..

నిమజ్జనాలు చూసేందుకు వచ్చే భక్తులు తమ వాహనాలు కేటాయించిన పార్కింగ్‌ స్థలంలో నిలపాలని కోరారు. బాలానగర్‌, మూసాపేట, ఎర్రగడ్డ, బోయిన్‌పల్లి, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, భాగ్యనగర్‌కాలనీల ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం అశోక్‌వన్‌మాల్‌, కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, పీఎస్‌ఎం స్కూల్‌, హుడా ట్రక్‌ పార్కు ప్రాంతాల్లో పార్కింగ్‌ ఏర్పాటు చేశారు. మూసాపేట, కైత్లాపూర్‌, కేపీహెచ్‌బీ 15వ ఫేజ్‌ నుంచి వచ్చే వాహనాలను రంగనాయక స్వామి ఆలయం ముందు ఉన్న ఖాళీ స్థలం, ఐడీఎల్‌ కంపెనీ, మైసమ్మ చెరువుకు వెళ్లే డబుల్‌ రోడ్డులో పార్కింగ్‌ ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి వై జంక్షన్‌ నుంచి వచ్చే వినాయక విగ్రహాలు చెరువు కట్ట పైకి వచ్చి ఐడీఎల్‌ కంపెనీ వద్ద యూ టర్న్‌ తీసుకుని నిమజ్జనం కోసం క్రేన్ల వద్దకు వస్తారు. మూసాపేట నుంచి వచ్చే వాహనాలు అలాగే వచ్చి ఐడీఎల్‌ కంపెనీ వద్ద కలుస్తాయి.



ఐడీఎల్‌ రంగధాముని చెరువులో నిమజ్జనం రూట్‌ మ్యాప్‌

ట్రాఫిక్‌ మళ్లింపు

హైటెక్‌ సిటీ, మాదాపూర్‌కు వెళ్లే వాహనాలను జేఎన్‌టీయూ మీదుగా వెళతాయి. చెరువు కట్టపైకి అనుమతి లేదు. మాదాపూర్‌ నుంచి వచ్చే వాహనాలు, కైత్లాపూర్‌ నుంచి మూసాపేట చౌరస్తాకు మళ్లింపు ఉంటుంది. నిమజ్జనానికి వచ్చే వాహనాలను మాత్రమే అనుమతి ఇస్తారు. ఐడీఎల్‌ చెరువు కట్టపైకి శనివారం ఉదయం 10 నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు ట్రాఫిక్‌ ఆంక్షలు ఉంటాయని వారు తెలిపారు.